నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | ఆదివారం 30 జూన్ 2024 | HANUMAKONDA

రాకేశ్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నిర్బంధకాండ

సీఎం పర్యటన నేపథ్యంలో పలువురిపై ఆంక్షలు

- రాకేశ్‌రెడ్డి హౌస్ అరెస్ట్, పలువురు విద్యార్థి నేతల ముందస్తుగా అదుపులోకి..
- ప్లకార్డులతో నిరుద్యోగుల నిరసన
- భగ్గుమన్న విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు

హనుమకొండ, జూన్ 29 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డితో పాటు కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కాగా, పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించనప్పటికీ హౌస్ అరెస్టు చేయడంపై రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో పోలీసుల పహారా, నిర్బంధాలు ఎందుకు? ప్రజా ప్రభుత్వమంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై ఆంక్షలు ఎందుకు పెడుతున్నారు. ఆరు నెలల పాలనకే ఇంత అభ ద్రతా భావమా? అన్నారు. సీఎం సహా సగం క్యాబినెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రైవేట్ దవాఖాన ప్రారంభించేందుకు ఎగేసుకొని వస్తున్నప్పటికీ వరంగల్‌కు సీఎం వస్తున్నారనే వాతావరణం, కలేలేదని విమర్శించారు. ప్రెస్‌మీట్ తర్వాతే సీఎం పర్యటనలో మార్పులు వచ్చాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నిర్మించ తలపెట్టిన 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు ఎందుకు జరగడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎంజీఎం హాస్పిటల్‌కు సందర్శించకుండా కార్పొరేట్ ఆస్పత్రి ప్రారంభానికి రావడం ఏమిటని ప్రశ్నించారు. కాకతీయ కళాతోరణాన్ని అధికారిక చిహ్నం నుంచి తొలగించడంపై సీఎం స్పష్టత ఇవ్వాలన్నారు. కాకతీయ కళా తోరణం రాచరిక దర్పం అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ఓరుగల్లు ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకపోతే ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులంతా రేవంత్‌రెడ్డి ఇంటిముందు ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. కడుపు మీద కొట్టినా ఓర్చుకుంటామని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకొనే ప్రసక్తి లేదని హెచ్చరించారు. గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులను చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లైబ్రరీలో నిర్బంధించడం అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నదని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఓట్లు వేస్తే గద్దెనెక్కి ఇప్పుడు వాళ్లనే తాళం వేసి బంధించడం కాంగ్రెస్ అవకాశవాదానికి అద్దం పడుతున్నదన్నారు. అందరినీ నిర్బంధించి పర్యటించడమేనా ప్రజా పాలన అని ప్రశ్నించారు. అంత భయం ఉన్నప్పుడు పర్యటనలు ఎందుకని, వర్చువల్‌గా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ఎద్దేవా చేశారు. అరెస్టయిన వారిలో 2వ డివిజన్ కార్పొరేటర్ రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు మండల సురేశ్, దేవయ్య, కేయూ నేత కొమురన్న, యాదగిరి, లక్ష్మణ్, అశోక్, గువ్వ రాజేశ్, పిన్నింటి విజయ్, ప్రశాంత్, శ్రీకాంత్, కార్తీక్, చందర్, కరుణాకర్, అనిల్, రవీందర్ రెడ్డి, కుమార్, నాగరాజ్, విజయ్, నిశాంత్, అన్నమాచారి ఉన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నిరుద్యోగులు

విద్యార్థి నాయకుల అరెస్టు..

నయీంనగర్/సుబేదారి : జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో విద్యార్థి నాయకులను కేయూసీ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పబ్బోజు శ్రీకాంత్‌చారి, శరత్‌చంద్ర, ప్రశాంత్, సూర్యకిరణ్, మనోజ్, రంజిత్, రాజేందర్, రాకేశ్, శ్రావణ్, నరేందర్, వీరస్వామి, స్నేహిత్, కల్యాణ్ ఉన్నారు. సుబేదారి పోలీసు స్టేషన్‌కు ఎనిమిది మందిని, హనుమకొండ స్టేషన్‌కు ఇద్దరు, కేయూ పోలీసు స్టేషన్‌కు ఐదుగురి బీఆర్ఎస్ నాయకులను తరలించారు. సాయంత్రం ములుగు రోడ్డులో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

రేవంత్‌రెడ్డికి నిరసన సెగ..

వరంగల్ : వరంగల్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డికి నిరుద్యోగుల నుంచి నిరసన సెగ తగిలింది. శనివారం నగరంలో 24 అంతస్తులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సందర్శనకు వచ్చిన సమయంలో ఎదురుగా ఉన్న సెంట్రల్ లైబ్రరీలో గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు కాన్వాయ్‌లో వస్తున్న సీఎంకు కనిపించేలా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచి డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 అభ్యర్థులను ఎంపిక చేయాలని ప్లకార్డుల ను ప్రదర్శించారు. డీఎస్సీ 3 నెలలు వాయిదా వేసి 25 వే ల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని నిరుద్యోగులు నినాదాలు చేశారు. అయితే నిరుద్యోగులు రోడ్డుపైకి రాకుండా పోలీసులు లైబ్రరీ గేట్‌కు తాళం వేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితుల అరెస్టు

దామెర : మండలం గుండా వెళ్లే నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న వారిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన దృష్ట్యా మండలంలోని ఊరుగొండ, పసరగొండ తదితర గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులను ముందస్తుగా అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుడు బొల్లు సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి తమ గోడును చెప్పుకునే అవకాశం లేకుండా పోలీసులు చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోనే భూ నిర్వాసితులు నిరసన తెలిపారు.

దామెర పోలీస్‌స్టేషన్‌లో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులు

హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి స్నాక్స్ రుచి చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి, ఎంపీ కావ్య

హనుమకొండ కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరంగల్‌పై స్పెషల్ ఫోకస్

సిటీ డెవలప్‌మెంట్ కోసం రూ. 6,115 కోట్లు
హెల్త్, ఎకో టూరిజం సిటీగా తీర్చిదిద్దాలి
రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ చేపట్టాలి

హైదరాబాద్‌తో పోటీపడేలా అభివృద్ధి

- స్మార్ట్‌సిటీ పనులను వేగవంతం చేయండి
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ రూపొందించండి
- సెప్టెంబర్ 9లోగా కాళోజీ కళా క్షేత్రం పనులు పూర్తిచేయాలి
- నిమ్స్‌లా ఎంజీఎం హాస్పిటల్‌కు ఎన్వోసీలు అందిస్తాం
- గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ, జూన్ 29 : వరంగల్‌పై ఇకతాను స్పెషల్ ఫోకస్ పెడతానని.. హైదరాబాద్‌తో పోటీపడేలా నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు హెల్త్, ఎకో టూరిజం సిటీగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం రూ.6,115 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అధికారులు సైతం వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ నగర అభివృద్ధిపై హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీఎం ఎనిమిది అంశాలపై సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా రింగ్ రోడ్డు, నిర్మాణం స్మార్ట్‌పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, విమానాశ్రయం పరిస్థితి, కాళోజీ కళాక్షేత్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. మొదట రింగ్ రోడ్డు నిర్మాణంపై హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ రెండు దశల్లో 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగ్‌రోడ్డు నిర్మాణానికి సత్వరమే భూసేకరణ చేపట్టి ఆ తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. వరంగల్ నుంచి ఇతర జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా జాతీయ రహదారుల కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్కుకు రోడ్డు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవలన్నారు. కాళోజి కళాక్షేత్రం పనులు సెప్టెంబర్ 9లోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరంగల్ నగరంలో కాలనీలు ముంపునకు గురవుతున్నాయని ఇందుకుగాను శాశ్వతంగా పరిష్కారం చూడాలని అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని, నాలాల ఆక్రమణపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. నాలాల్లో సిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో చేపడుతున్న కొత్త పద్ధతులను వరంగల్ నగరంలో ప్రయోగించాలన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు.

యూజీడీ కోసం డీపీఆర్ రూపొందించండి

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై డీపీఆర్ తయారు చేయాలని సీఎం ఆదేశించారు. వర్షం కురిచినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల అంచనాల వ్యయం ఎందుకు పెరిగిందని అధికారులను ప్రశ్నించారు. ఎలాంటి అప్రూవల్ లేకుండా రూ.1100 కోట్ల నుంచి రూ.1726 కోట్లకు ఎలా పెరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈపీసీ పద్ధతిన పనులు చేపడుతున్నందున అలా పెంచే వీలు లేదని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. పనుల విలువ అంచనాల పెంపుపై ప్రత్యేక రిపోర్టు తయారుచేయాలని సీఎం ఆదేశించారు. నగర అభివృద్ధిపై ప్రతి 20 రోజులకోసారి సమీక్షించాలని ఆదేశించారు. 2050 సంవత్సరానికి అనుగుణంగా వరంగల్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ డిజైన్ చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రి మాదిరిగా వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మమునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేవించారు. ఇందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందో తెలుసుకోవాలని పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ' వైద్యుల, సిబ్బందికి పారితోషికం

అత్యవసర సమయంలో ఆపరేషన్లు, ఇతర వైద్య సేవలు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్ఓసీ ఇచ్చే అంశంపై పరిశీలన చేస్తామని సీఎం వెల్లడించారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామని సీఎం ప్రకటించారు. స్వశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫాం పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉందని ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. ఇందిరా మహాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో వరంగల్ అభివృద్ధిపై జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమగ్రంగా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం స్వశక్తి మహిళలకురూ. 518 కోట్ల 71 లక్షల 20వేల చెక్కును సీఎం అందజేశారు.

త్వరలో సమావేశం నిర్వహిస్తాం: - మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలో ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి వరంగల్ సమగ్ర అభివృద్ధిపై సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రింగ్ రోడ్డు భూసేకరణ అంశం వేగవంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ వ్యయ అంచనాల పెంపుపై సమగ్రంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

మాస్టర్ ప్లాన్ సరిగా లేదు - మంత్రి కొండా సురేఖ

కుడా మాస్టర్‌ప్లాన్ సరిగా లేదని, మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ, సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నగర అభివృద్ధికి నిరంతర కృషి చేసేందుకు స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎంను కోరారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్ అభివృద్ధికి సీఎం చేసిన సూచనలు పాటిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమార్ తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మామిడాల యశస్విని, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్, రాష్ట్ర టూరిజం, కల్చర్ యూత్ అడ్వాన్స్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణీప్రసాద్, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టియానో జెడ్ చోంగ్తో, ఇంధన శాఖ సెక్రటరీ రొనాల్డ్ రోస్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారదాదేవి, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, రోడ్ల భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ హరిచందన, సెర్ప్ సీఈవో దివ్య, హౌసింగ్ శాఖ స్పెషల్ సెక్రటరీ వీపీ గౌతమ్, ఆర్ అండ్ బీ శాఖ జాయింట్ సెక్రటరీ హరీశ్, ఐ అండ్ పీఆర్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత రావు, ఎన్పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

విన్నపాలు వినలే!

సీఎంకు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన 104 ఉద్యోగులు

సీఎంను కలువకపోవడంతో నిరాశతో వెళ్తిపోతున్న దివ్యాంగురాలు రజిత

ప్లకార్డుతో రెడ్డికాలనీకి చెందిన బాలుడు మహ్మద్ ఆదిల్ అహ్మద్

దరఖాస్తుదారులకు నిరాశ

ముఖ్యమంత్రికి తమ గోడు చెప్పుకుందామని వచ్చిన పలువురికి నిరాశే మిగిలింది. నగర పర్యటనలో భాగంగా హనుమకొండకు సీఎం రేవంత్‌రెడ్డి రాగా స మస్యలను చెప్పుకునేందుకు వినతిపత్రాలతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అయితే సమీక్ష పూర్తయ్యే వరకూ వారు వేచి ఉన్నప్పటికీ సీఎం దరఖాస్తులను తీసుకోలేదు. దీంతో అందరూ నిరాశతో వెనుదిరుగగా, కొందరు పత్రాలను బస్సులోకి విసిరేశారు. వినతిపత్రాలను తీసుకోకపోవడంపై అసహ నం వ్యక్తంచేశారు. అక్కడ ఓ చిన్నారి 'సీఎం సర్.. ప్లీజ్ హెల్ప్ మీ' అంటూ ప్లకార్డుతో వేచి ఉండడం అందరినీ ఆవేదనకు గురిచేసింది. ఎంతో ప్రయాసకోర్చి వీల్‌ఛైర్‌లో వచ్చిన ఓ ది వ్యాంగురాలు నిట్టూర్పుతూ అక్కడినుంచి వెళ్లిపోయింది.

– హనుమకొండ, జూన్ 29

జగదీశ్వర్‌కు ఘన నివాళి

దివంగత ములుగు జడ్పీ చైర్మన్ ప్రథమ వర్ధంతికి హాజరైన మంత్రి సీతక్క, మాజీ మంత్రి ఎర్రబెల్లి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యేలు


జగదీశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ములుగురూరల్, జూన్ 29 : ములుగు జిల్లా తొలి జడ్పీ చైర్మన్, దివంగత కుసుమ జగదీశ్వర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం నేతలు ఘన నివాళి అర్పించారు. మంత్రి సీతక్క, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, శంకర్‌నాయక్, తాటికొండ రాజయ్య, రాష్ట్ర నేతలు గ్యాదరి బాలమల్లు, కర్నె ప్రభాకర్, ములుగు, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల జడ్పీ అధ్యక్షులు బడే నాగజ్యోతి, సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, వరంగల్ జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్ వేరు వేరుగా మల్లంపల్లికి చేరుకున్నారు. ప్రథమ వర్ధంతి సభ వేదికపైకి చేరుకొని జగదీశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్‌కు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లా తొలి జడ్పీ చైర్మన్‌గా ప్రజల సంక్షేమం కోసం పాటు పడిన నేత జగదీశ్వర్ అన్నారు. ఆయనకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సముచిత స్థానం కల్పించి జడ్పీ చైర్మన్ ఎంపిక చేశారని తెలిపారు. అనతికాలంలోనే ఆయన అకాల మరణం ములుగు ప్రజలతో పాటు బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. జగదీశ్వర్ కుటుంబానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మంగపేట మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రామ్‌నాయక్, మల్లంపల్లి ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, వాత్సవాయి శ్రీధర్‌వర్మ, రాజుయాదవ్, సమ్మయ్య, ముకుందం, నరేందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు కోగిల మహేశ్, తిరుపతి, శ్రీనివాస్, గుడివాడ శ్రీహరి, బైకాని సాగర్, దుర్గం రమణయ్య, కాంగ్రెస్ నాయకుడు బాదం ప్రవీణ్, నాయకులు మర్రి యాదవరెడ్డి, రఘు, శ్రీనివాస్, రమణ, సూర్యకిరణ్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు వినయ్, ప్రశాంత్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.


జగదీశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు

మెగా పార్కులో వజ్రోత్సవ వనమహోత్సవం

పొగడ మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం
- పార్కులో వస్త్ర పరిశ్రమల స్థాపన, మౌలిక వసతులపై ఆరా
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పరిశీలన
- నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి అసంతృప్తి

మొక్కనాటి నీళ్లు పోస్తున్న సీఎం

వరంగల్, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్ జిల్లాలో పర్యటించారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన తొలిసారి జిల్లాకు వచ్చారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా గీసుగొండ మండలంలోని శాయంపేట వద్ద గల కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరుకున్నారు. టెక్స్‌టైల్ పార్కులో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పొగడ మొక్క నాటడం ద్వారా ఈ ఏడాది రాష్ట్రస్థాయి వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పచ్చదనం పెంపు లక్ష్యంగా ఈ ఏడాది రాష్ట్రంలో 20.20 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పీసీసీఎఫ్ డోబ్రియల్ వెల్లడించారు. అనంతరం కిటెక్స్ కంపెనీ వద్ద పరిశ్రమల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు స్థలాల కేటాయింపు విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి బాధిత రైతులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అధికారులకు చెప్పారు. అనంతరం ఆయన 24 అంతస్తులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్ప త్రి నిర్మాణ పనుల పురోగతిపై గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన మ్యాప్ ద్వారా పనుల వివరాలను తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగినవి, ఇంకా మిగిలి ఉన్న పనుల వివరాలను ఆర్‌అండ్‌బీ, వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు. ఈ క్రమంలో ఆస్పత్రి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.